ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | శుక్రవారం | 25.09.2026 | సంపుటి : 2 | సంచిక : 83 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్




**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 107 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 134 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 208 (కిలో) |
| స్కిన్ లెస్ | 235 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

## ఖైరతాబాద్ నా అడ్డా..

### ప్రజల్లో నాకు బలముంది : దానం



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : ఎమ్మెల్యే పదవికి అనర్హత అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. ప్రజా క్షేత్రంలో తనకు బలముందని చెప్పారు. అనర్హత వేటుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఆయన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం -మిగతా 2 లో..

# నేడూ భారీ వర్షాలు

### నిండుతున్న చెరువులు, కుంటలు..

అత్యధికంగా మధిర, భూపాలపల్లిలో 13 సెం.మీ. నమోదు

9 జిల్లాలకు ఆకస్మిక వరద ముప్పు ఉందని ఐఎండీ హెచ్చరిక



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. 24 గంటల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సరాసరి 98.75 మి.మీ. వర్షపాతం నమోదైంది. రానున్న 24గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఉమ్మడి కరీంనగర్‌తో పాటు మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి.

-మిగతా 2 లో..

## కోర్టుకెక్కిన 'క్షుద్రపూజల' వివాదం

### హరీశ్ రావుకు కీలక పరిణామం

మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం పిటిషన్లను న్యాయస్థానం స్వీకరించినట్లు హరీశ్ వెల్లడి

సెప్టెంబర్ 30న తన వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు కోర్టు అనుమతించిందని తెలిపిన మాజీ మంత్రి

దానం నాగేందర్ అనర్హత అంశంపైనా స్పందన.. పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : రాజకీయ ఆరోపణలు ఇప్పుడు న్యాయస్థానం వరకు చేరాయి. తనపై 'క్షుద్రపూజలు' చేశారంటూ ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం పిటిషన్లను కోర్టు విచారణకు స్వీకరించిందని ఆయన వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద గురువారం మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్‌ను నమోదు చేయడానికి న్యాయస్థానం అనుమతించినట్లు తెలిపారు. ఈ పరిణామాన్ని సంబంధిత కేసులో తదుపరి దశగా -మిగతా 2 లో..



## సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు

### 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026'కు ఎంపిక

కేరళలో నేడు తెలంగాణ ముఖ్యమంత్రికి ప్రతిష్టాత్మక పురస్కారం

'ఆర్యదాన్ మహమ్మద్-2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ పురస్కారానికి రేవంత్ రెడ్డి ఎంపిక

దివంగత కేరళ కాంగ్రెస్ నేత ఆర్యదాన్ మహమ్మద్ స్మారకంగా అవార్డు

హైదరాబాద్, సెప్టెంబర్ 24: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి మరో ప్రతిష్టాత్మక గుర్తింపు దక్కింది. కేరళకు చెందిన దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ జ్ఞాపకార్థం అందించే "ఆర్యదాన్ మహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు"కు ఆయన ఎంపికయ్యారు. రైతులు, వెనుకబడిన తరగతులు, సాధారణ ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన -మిగతా 2 లో..

## భూ ఆక్రమణలు నిగ్గు తేల్చేందుకు

# ప్రత్యేక కమిటీ

### కేసీఆర్.. కుటుంబ సభ్యుల భూములపై విచారణ

జాబితాలో కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, గంగుల, పల్లా..

కమిటీ చైర్‌పర్సన్‌గా సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

భూ అక్రమాలు, ఆక్రమణల నిగ్గు తేల్చేందుకు శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు.. ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 16 అంశాలపై విచారణ చేయాలని నిర్ణయించింది.



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, టి.హరీశ్‌రావులతోపాటు.. వారి కుటుంబ సభ్యులు, మరికొందరు భారాస నేతలకు సంబంధించి ఆయా గ్రామాల్లోనే భూముల వివరాలను విచారణ అంశాల్లో చేర్చింది. వారి అధీనంలోని భూముల్లో ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయి, ఎసైన్డ్, ఇతర భూముల ఆక్రమణలు, కొనుగోళ్లు జరిగాయన్న ఆరోపణల నిగ్గు తేల్చాలని విచారణ కమిటీకి నిర్దేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఉత్తర్వులు జారీచేశారు.

-మిగతా 2 లో..



ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో

**ఊరట** 07



02

**ప్రణయ్ పరువు హత్యకేసు..**

చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మృతి

## భూములు 22ఏలో ఉన్నా..

# రిజిస్ట్రేషన్‌కు మార్గం

### ఆస్తి యజమానులకు తెలంగాణ సర్కార్ ఊరట

సాంకేతిక కారణాలు, రెవెన్యూ వర్గీకరణతో నిషేధిత జాబితాలో చేరిన ఆస్తులకు వర్తింపు

అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై విచారణకు ప్రత్యేక ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు

ఏళ్లుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 22ఏ భూముల యజమానులకు తెలంగాణ ప్రభుత్వం తాజాగా కీలక వెసులుబాటు కల్పించింది. నిషేధిత ఆస్తుల జాబితాలో పేరు ఉన్నప్పటికీ, సంబంధిత ప్రణాళికా సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే అనుమతులు పొందిన లేఅవుట్లు, నిర్మాణాలకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది.

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులున్న లేఅవుట్లు, భవనాలకు రిజిస్ట్రేషన్ అవకాశం




హైదరాబాద్, సెప్టెంబర్ 24 : నగరాభివృద్ధి సంస్థలైన జీహెచ్ఎంసీ, హెచ్ఎం డీఏ, డీటీసీపీ నుంచి అనుమతులు పొందిన ఆస్తులు కేవలం సాంకేతిక కారణాలు లేదా రెవెన్యూ రికార్డుల వర్గీకరణ కారణంగా 22ఏ పరిధిలోకి వెళ్లిన సందర్భాల్లో ఈ వెసులుబాటు వర్తించనుంది. సంబంధిత అనుమతులు, పత్రాలను పరిశీలించిన అనంతరం రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగించేందుకు వీలు కలుగుతుంది. దీంతో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయలేక నిలిచిపోయిన ఆస్తులపై యాజమాన్య హక్కుల బదిలీకి అవకాశం ఏర్పడనుంది. కొనుగోలు, విక్రయాలు నిలిచిపోయిన -మిగతా 2 లో..



## దానం నాగేందర్‌పై అనర్హత కరెక్టే

### హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

తీర్పుపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు.. రాహుల్, రేవంత్‌పై విమర్శలు

ఫిరాయింపుల అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చిన హరీశ్‌రావు

ఇతర పార్టీ మారిన ఎమ్మెల్యేలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 : తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల వ్యవహారంపై సాగుతున్న న్యాయ-పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో మరో కీలక మలుపు వచ్చింది. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం గురువారం సమర్థించింది. హైకోర్టు నిర్ణయంలో జోక్యం చేసుకునే కారణం లేదంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పును రాజకీయంగా ప్రస్తావిస్తూ, పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో అధికార పార్టీ తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. దానం నాగేందర్ అనర్హత నుంచి బయటపడేందుకు చేసిన న్యాయపోరాటం -మిగతా 2 లో..




## భూములు 22ఏలో ఉన్నా..
# రిజిస్ట్రేషన్‌కు మార్గం..

(మొదటిపేజీ తరువాయి)

అనేక కాలనీల్లో స్థిరాస్తి లావాదేవీలు మళ్లీ కదలికలోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు హౌసింగ్ కాలనీల ప్రజలకు ఈ నిర్ణయం ప్రయోజనం చేకూర్చనుంది. ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకునే ఆస్తి యజమానులు తమ వద్ద ఉన్న సంబంధిత అనుమతులు, హక్కు పత్రాలతో అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. పత్రాల ఆధారంగా పరిశీలన పూర్తయిన తర్వాత ఆస్తిపై ఉన్న రిజిస్ట్రేషన్ పరిమితులను తొలగించే ప్రక్రియ చేపట్టాలని రెవెన్యూ శాఖ సూచించింది. అయితే 22ఏ వ్యవహారంలో జరిగిన అక్రమాలు, నిబంధనలకు విరుద్ధంగా చోటుచేసుకున్న పరిణామాలపై ప్రభుత్వం మరోవైపు విచారణకు సిద్ధమైంది. అసెంబ్లీలో ఈ అంశంపై చర్చ జరిగిన నేపథ్యంలో ప్రత్యేక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఈ కమిటీకి అధ్యక్షత వహించనున్నారు. రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా సభ్యులుగా ఉండగా, సంబంధిత జిల్లాల కలెక్టర్లు కూడా కమిటీతో కలిసి పనిచేయనున్నారు. 22ఏ కింద భూములు, ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్లిన విధానం, అందులో చోటుచేసుకున్న అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై కమిటీ పరిశీలన చేయనుంది. ఈ విచారణ కేవలం 22ఏ అంశానికే పరిమితం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒకవైపు అర్హత కలిగిన ఆస్తులకు రిజిస్ట్రేషన్ మార్గం సులభతరం చేస్తూనే, మరోవైపు అక్రమాలపై విచారణకు చర్యలు చేపట్టడం ద్వారా ప్రభుత్వం రెండు దిశల్లో నిర్ణయాలు తీసుకుంది.

## కోర్టుకెక్కిన 'క్షుద్రపూజల' వివాదం..

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని పేర్కొంటూ హరీశ్ రావు కోర్టును ఆశ్రయించారు. తనపై జరిగిన ప్రచారం వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉందన్నది ఆయన వాదన. ఈ మేరకు సంబంధిత ఆధారాలను కూడా సమర్పించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 18న ఈ కేసుకు సంబంధించి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్లు దాఖలైనట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంపై మాట్లాడిన హరీశ్ రావు.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి దృష్టిని మళ్లించేందుకే తనపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అసెంబ్లీకి డిప్యూటీ స్పీకర్‌ను నియమించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. సభా హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన నోటీసుల విషయంలోనూ స్పీకర్ స్పందించడం లేదని విమర్శించారు. ఇవన్నీ తన రాజకీయ అభిప్రాయాలు, ఆరోపణలేనని గమనించాలి.

### దానం నాగేందర్ అంశంపైనా హరీశ్ స్పందన

ఇదే సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై కూడా హరీశ్ రావు మాట్లాడారు. పార్టీ ఫిరాయింపుల కేసులో దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సెప్టెంబర్ 24న సమర్థించింది. దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించినట్లు పలు తాజా నివేదికలు వెల్లడించాయి. ఈ తీర్పుపై స్పందించిన హరీశ్ రావు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఇతర పార్టీ ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించి ప్రజా తీర్పును కోరాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మిగతా ఎమ్మెల్యేల విషయంలోనూ ఇదే అంశం రాజకీయ చర్చకు వస్తోందని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా, ఒకవైపు తనపై వచ్చిన 'క్షుద్రపూజల' ఆరోపణలను న్యాయస్థానంలో ఎదుర్కొనేందుకు హరీశ్ రావు సిద్ధమవుతుండగా.. మరోవైపు దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు తీర్పును ఆధారంగా చేసుకుని పార్టీ ఫిరాయింపుల అంశాన్ని రాజకీయంగా ప్రస్తావించారు. సెప్టెంబర్ 30న హరీశ్ రావు వాంగ్మూలం నమోదు కానుండటంతో పరువునష్టం కేసు తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.



## ప్రణయ్ పరువు హత్యకేసు..
### చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మృతి

**హైదరాబాద్:** ప్రేమ వివాహం చేసుకున్న నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ హత్య కేసు(ాతీఖుఖుం ఎబతీసవతీ ఝంవ)లో జీవితఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ (50) చర్లపల్లి జైలులో గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గుండెపోటు రావడంతో జైలు సిబ్బంది వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అబ్దుల్ బారీ మృతి చెందాడు. 2018 సెప్టెంబర్ 14న నల్గొండ జిల్లా మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసులో బారీ నాల్గో నిందితుడు. గుజరాత్‌కు చెందిన మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులోనూ అబ్దుల్ బారీ నిందితుడిగా ఉన్నాడు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన, నల్గొండ జిల్లా మిర్యాలగూడలో 2018లో జరిగిన పెరుమాళ్ల ప్రణ–య్‌కుమార్ పరువు హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష, మరో ఆరుగురికి జీవితఖైదు విధిస్తూ నల్గొండ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం, రెండో అదనపు సెషన్స్ జిల్లా కోర్టు గతేడాది మార్చిలో సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ప్రథమ ముద్దాయి తిరునగరు మారుతీరావు... 2020లో హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతనిపై విచారణను న్యాయస్థానం అప్పుడే నిలిపివేసింది. ఐదేళ్ల తొమ్మిదినెలల సుదీర్ఘ విచారణ తర్వాత.. హత్యలో కీలక పాత్రధారి సుభాష్‌కుమార్‌శర్మకు ఉరిశిక్ష, ఏ3: అస్గర్ అలీ, ఏ4: అబ్దుల్ బారీ, ఏ5: అబ్దుల్ కరీం, ఏ6: శ్రవణ్‌కుమార్ (మారుతీరావు తమ్ముడు), ఏ7: శివ (మారుతీరావు కారుడ్రైవర్), ఏ8: నిజాం (ఆటోడ్రైవర్)కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం అప్పట్లో తీర్పు ఇచ్చింది.

# దానం నాగేందర్‌పై అనర్హత కరెక్టే

(మొదటిపేజీ తరువాయి)

విఫలమైందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల తీర్పుతో గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ మారిన తర్వాత కూడా పదవుల్లో కొనసాగేందుకు ప్రయత్నించడాన్ని ఆయన తప్పుబట్టారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి స్పీకర్ వ్యవస్థను ఆధారంగా చేసుకుని ఫిరాయింపుల అంశాన్ని అధిగమించవచ్చని భావించారని కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే ప్రయత్నాలు జరిగాయని ఆయన విమర్శించారు. కేటీఆర్ తన ఎక్స్ పోస్టులో సుప్రీంకోర్టు తీర్పును రాహుల్, రేవంత్‌కు "సుప్రీం చెంపపెట్టు"గా అభివర్ణించారు.

### ఖైరతాబాద్ ఉప ఎన్నికపైనా కేటీఆర్ వ్యాఖ్యలు

దానం నాగేందర్ అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు హైకోర్టు తీర్పులో పేర్కొనగా, సుప్రీంకోర్టు కూడా ఆ నిర్ణయంలో జోక్యం చేసుకోలేదు. ఈ నేపథ్యంలో రాబోయే ఖైరతాబాద్ ఉప ఎన్నికను ప్రస్తావిస్తూ కేటీఆర్ కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. ప్రజలు తమ తీర్పుతో స్పందిస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అంటూ ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశాన్ని కూడా ప్రస్తావించారు.

### హరీశ్‌రావు డిమాండ్ ఏంటంటే..

సుప్రీంకోర్టు తీర్పుపై బీఆర్‌ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్‌రావు కూడా స్పందించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ.. పార్టీ ఫిరాయింపుల విషయంలో భిన్నంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ నిజంగా రాజ్యాంగ విలువలకు ప్రాధాన్యత ఇస్తే.. కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్లీ ప్రజల తీర్పు కోరాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి





మాట్లాడి, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంపై మౌనం వహించడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు.

### ఫిరాయింపుల అంశంపై మళ్లీ రాజకీయ వేడి

దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ స్థానంపై తదుపరి రాజకీయ పరిణామాలపై దృష్టి పడింది. అదే సమయంలో ఈ తీర్పును బీఆర్‌ఎస్ నేతలు రాష్ట్రంలోని ఇతర పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంతో ముడిపెడుతున్నారు. కాగా, దానం నాగేందర్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ పరిణామాల ఆధారంగా తెలంగాణ హైకోర్టు ఆయనను అనర్హుడిగా ప్రకటించగా, తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆ నిర్ణయంలో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో తెలంగాణలో పార్టీ ఫిరాయింపులపై కొనసాగుతున్న రాజకీయ చర్చ మరోసారి వేడెక్కింది. బీఆర్‌ఎస్ నేతల తాజా వ్యాఖ్యలతో ఈ అంశం ఇకపై రాజకీయంగానూ మరింత ప్రాధాన్యం సంతరించుకునే పరిస్థితి కనిపిస్తోంది.

## సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు..

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలతో పాటు ఆయన నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని ఇవాళ కేరళలోని నిలంబూరులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి అవార్డును అందజేయనున్నారు. పురస్కారంలో రూ.లక్ష నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక కూడా ఉన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

### ఏ అంశాలను పరిగణనలోకి తీసుకున్నారంటే..

తెలంగాణలో రైతులు, బీసీలు, సామాన్య ప్రజల సంక్షేమానికి సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమాలను అవార్డు ఎంపిక కమిటీ పరిగణనలోకి తీసుకున్నట్లు ఆర్యదాన్ మహమ్మద్ ఫౌండేషన్ తెలిపింది. ముఖ్యమంత్రి నాయకత్వంతో పాటు ప్రజాస్వామిక విలువల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతను కూడా జ్యూరీ ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఈ అవార్డు ఎంపిక ప్రక్రియలో ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ మంత్రి ఏపీ అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్పెట్ట నారాయణన్ జ్యూరీ సభ్యులుగా వ్యవహరించినట్లు సమాచారం.

### ఆర్యదాన్ మహమ్మద్ పేరుతో..

కేరళకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆర్యదాన్ మహమ్మద్ స్మారకంగా ఈ పురస్కారాన్ని ఆర్యదాన్ మహమ్మద్ ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. ఆయన కేరళ అసెంబ్లీకి ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, రాష్ట్ర ప్రభుత్వాల్లో నాలుగుసార్లు



మంత్రిగా వివిధ శాఖలు నిర్వహించారు. ఆయన నాలుగో వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న స్మారక కార్యక్రమంలోనే రేవంత్ రెడ్డికి ఈ ఏడాది పురస్కారం అందించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్ ఆర్యదాన్ మహమ్మద్ స్మారక ఉపన్యాసం ఇవ్వనున్నారు.

## 1న మంత్రివర్గ సమావేశం

హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో వచ్చే నెల 1న సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఇందులో పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. పలుశాఖల్లో కొత్త పోస్టుల మంజూరు, పరిశ్రమల అవసరాలకు భూముల కేటాయింపు తదితర అంశాలపై మంత్రిమండలి చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ సరఫరాకు సత్వర చర్యలు, 22ఏపై కమిటీల ఏర్పాటు, డిసెంబరులో నిర్వహించనున్న గ్లోబల్ సమిట్ ప్రోగ్రెస్ అంశాలపై క్యాబినెట్‌లో నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం.

## భూ ఆక్రమణలు నిగ్గు తేల్చేందుకు
# ప్రత్యేక కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం జారీ అయిన ఈ జీవో.. గురువారం వెలుగులోకి వచ్చింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ.శ్రీదేవసేనను కమిటీ ఛైర్‌పర్సన్‌గా నియమించారు. స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతోపాటు.. ఆయా భూములున్న జిల్లాకు చెందిన కలెక్టర్ సభ్యులుగా ఉంటారు. తుది నివేదిక ఇచ్చేలోగా అంశాల తీవ్రతను బట్టి మధ్యంతర నివేదికలను సమర్పించాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. సిద్దిపేట, రంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో క్షేత్రస్థాయి విచారణను ఈ కమిటీ చేపట్టనుంది.



## ఖైరతాబాద్ నా అడ్డా..

(మొదటిపేజీ తరువాయి)

గురువారం డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. "ఎంపీగా పోటీ చేసినప్పుడే ఊహించా.. అదే జరిగింది. లీగల్‌గా పోరాడటంలో తప్పులేదు. పదో షెడ్యూల్ ప్రకారం రిలీఫ్ దొరుకుతుందని అనుకున్నా. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. నేను ప్రతి ఇంటికి వెళ్లి సేవ చేశా.. నేనేంటో ప్రజలను అడిగితే తెలుస్తుంది. ఉప ఎన్నికలో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు. గతంలో మూడుసార్లు గెలిచాను. ఒక ఉప ఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ఫలితాలే ఇక్కడా రిపీట్ అవుతాయి. ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా. కలిసి పనిచేస్తాం.. తప్పకుండా గెలుస్తాం" అని దానం నాగేందర్ అన్నారు.

# నేడూ భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

బలమైన గాలుల కారణంగా కోతకు వచ్చిన వరి పైరు నేలకొరిగింది. పలు చోట్ల చెట్లు నేలకూలి, రవాణా, విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. కుమరంభీం ప్రాజెక్టులోకి 5,139 క్యూసెక్కుల వరదనీరు, వట్టివాగు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 1,800 క్యూసెక్కులు ఉంది. పెద్దవాగు పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ముసురుతో కూడిన వానతో పంటలకు ఊపిరి పోసినట్లయింది. సూర్యాపేట జిల్లాలో 10గంటల పాటు కురిసిన వర్షానికి చెరువుల్లోకి నీరు వచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు దిగువన మూసీ రిజర్వాయర్‌కు 460.55క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 645అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం గురువారం సాయంత్రానికి 641.60అడుగులు(3.35టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వకు 591.74క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షం పడింది. మున్నేరు, ఆకేరు తదితర ఏర్లు, వాగుల్లో జలకళ కనిపిస్తోంది. జిల్లాలో 1.30 సెం.మీ సగటు వర్షపాతం నమోదైంది. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టాన్ని దాటింది. ఐదు అలుగుల నుంచి వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది. అశ్వరావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టుకు భారీగా వరద చేరడంతో 6,800 క్యూసెక్కుల వరద దిగువకు వదిలారు. ములకలపల్లి మండలం మూకమామిడి ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో మత్తడి పోసింది. కిన్నెరసాని పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదకు 405.60 అడుగులకు చేరింది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు ఛత్తీసగఢ్ అటవీప్రాంతం నుంచి వరద



వస్తుండటంతో 8గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి 16.80 అడుగుల వద్ద కొనసాగుతుండగా 1.23 క్యూసెక్కుల వరద ఫ్లో ఉంది. వానల కారణంగా సింగరేణి రీజియన్ పరిధిలోని కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, సత్తుపల్లిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం ఘాట్ రోడ్డుపై కొండ చరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో ఎటువంటి వాహనాల రాకపోకలు, జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



## ప్రశాంత్ నగర్ గణనాథ మండపంలో మహా అన్నసమారాధన

**చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో 2500 మందికి అన్న ప్రసాద వితరణ**

**శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం గణనాథ మండపం వద్ద బిజెపి రాష్ట్ర నాయకుడు చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వ ర్యంలో గురువారం మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా 2500 మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద విత రణ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సం దర్భంగా ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 మొదలు అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చింతకింది గోవర్ధన్ గౌడ్ తెలిపారు.



## పవర్‌లిఫ్టర్ అజయ్ బెనర్జీకి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందనలు

**ఏడబ్ల్యూపీసీ ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజత పతకం**

**మల్లాపూర్ :** అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏడబ్ల్యూపీసీ వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్--2026లో అద్భుత ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సాధించిన పవర్‌లిఫ్టర్ అజయ్ బెనర్జీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. అజయ్ బెనర్జీ సాధించిన విజయాలు మల్లాపూర్‌తో పాటు తెలంగాణ, దేశానికి గర్వకారణమని బండారి లక్ష్మారెడ్డి అన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. రాబోయే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో అజయ్ బెనర్జీ మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, సీనియర్ నాయకుడు సాయి జెన్ శేఖర్, గుల్మోహర్ గార్డెన్స్ జీ బ్లాక్ వాసులు ఎండీ ఉస్మాన్, దుర్గాప్రసాద్, అధ్యక్షుడు ధనాంజయ్ కులకర్ణి, లక్ష్మీచరణ్, నూతన లక్ష్మీ, ప్రభాకర్, ముఖేష్ అగర్వాల్, సంజీత్, పవన్ శర్మ, వంశీకృష్ణ, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, లింగాల రాజేష్ గౌడ్, రమణ తదితరులు పాల్గొన్నారు.



## హైదర్‌నగర్‌లో గణేష్ లడ్డూ వేలం పాట

**శేరిలింగంపల్లి :** హైదర్‌నగర్‌లో బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలం పాట భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ వేలం పాటలో స్థానిక భక్తులు, యువత, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేలం పాటను తిలకించారు.వేలం పాటలో మొదటి లడ్డూను ప్రమోద్ గౌడ్ రూ.1,01,000లకు దక్కించుకున్నారు. మరో లడ్డూను శ్రీనివాస్ రూ.51,000లకు వేలం పాటలో సొంతం చేసుకున్నారు. లడ్డూలను దక్కించుకున్న భక్తులను నిర్వాహకులు అభినందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తుల సహకారంతో గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బాల గణేష్ యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షల వెల్లువ

**మహిళల గౌరవం, భద్రత, సాధికారత కోసం కృషి చేయాలి**

**మేడ్చల్ :** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన నేరెళ్ల శారదకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరే షన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఓబీసీ కన్వీనర్ ధనలక్ష్మి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు జి. రవి ముదిరాజ్ ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేరెళ్ల శారదకు పుష్పగుచ్చాలను అంద జేసి అభినందనలు తెలిపారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఆమె నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల గౌరవం, భద్రత, సాధికారత, సంక్షేమం కోసం ఆమె విశేషంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. మహిళల హక్కుల పరిరక్షణ, వారికి న్యాయం అందించడం, మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరుకున్నారు. మహిళల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఓబీసీ కన్వీనర్ ధనలక్ష్మి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు జి. రవి ముదిరాజ్ పాల్గొన్నారు.

# బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదు

- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపితే వేధింపులా?
- అభివృద్ధిని ఓర్వలేకే కొందరు అనవసర వివాదాలకు తెరలేపుతున్నారు
- బెదిరింపులతో భయపెట్టలేరు.. ప్రజల కోసం పోరాటం ఆపేది లేదు: గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 24 (జనం వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వారిని అభినందిస్తూ ఓ మహిళ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయడాన్ని సైతం వివాదం చేయడం సరికాదని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. నల్లగండ్ల హుడా కాలనీలో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయిన సందర్భంగా ఉమా సఫైర్ హైట్స్‌కు చెందిన ప్రసన్న కుమారి అభివృద్ధి పనులకు కృతజ్ఞతలు తెలుపుతూ పోస్టు చేయగా, కొందరు కాలనీ, పార్టీ నాయకులు ఆమెను బెదిరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసినట్లు గంగాధర్ రెడ్డి తెలిపారు. ఒక మహిళ తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేస్తే ఆమెను



వేధించడం, బెదిరించడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. రాజకీయ విభేదాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేయాలని సూచించారు. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తాను గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే సహకారంతో డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని గంగాధర్ రెడ్డి తెలిపారు. బస్తీలు, కాలనీలు, ప్రధాన రహదారులు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, సీసీ రోడ్లు, బీటీ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. స్థానికుడిగా గత 20 ఏళ్లుగా మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, బీజేపీ నేత రవికుమార్ యాదవ్ నాయకత్వంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పదవిలో ఉ న్నా లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారం చేస్తూ తనపై, తన అనుచరులపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తే చట్టపరంగా ఎదుర్కొంటామని గంగాధర్ రెడ్డి హెచ్చరించారు. బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లి, తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రజలు, కార్యకర్తలు, నాయకులకు తాను అండగా ఉంటానని గంగాధర్ రెడ్డి భరోసా ఇచ్చారు. నల్లగండ్ల హుడా కాలనీ అభివృద్ధికి రాజకీయ భేదాలను పక్కనపెట్టి అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివసింగ్, నల్లగండ్ల డివిజన్ అధ్యక్షుడు కిషన్ గోలి, సీనియర్ నాయకులు లక్ష్మణ్, శేఖర్, రాకేష్, అనుష్మాన్ మిశ్రా, రంజిత్ పూరి, దొరబాబు, మహేష్, ప్రసన్న కుమారి, ఉదయలక్ష్మి, శ్రీలక్ష్మి, హేమ నళిని తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంకల్పానికి ప్రతీకగా మహా అన్నసమారాధన

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 24 (జనం వార్త):** ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథ మండ పం వద్ద గురువారం మహా అన్నసమారాధన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చింతకింది గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2,500 మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసా దాన్ని స్వీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్' పేరిట వివిధ సేవా





కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చింతకింది గోవర్ధన్ గౌడ్ తెలిపారు. ఇందులో భాగంగా వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఐదు గణనాథ మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించినట్లు చెప్పారు. ఇప్పటికే ఆదర్శ్ నగర్ కాలనీ, లింగంపల్లి రేయిన్ ట్రీ కమ్యూనిటీ, గోపి నగర్ బజరంగ్ యూత్ గణనాథ మండపాల వద్ద ఒక్కోచోట వెయ్యి మందికి చొప్పున అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. తాజాగా ప్రశాంత్ నగర్ కాలనీ గణనాథ మండపం వద్ద 2,500 మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం అందించే అవకాశం కల్పించిన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, పరిసర కాలనీల ప్రముఖులు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో ఐక్యత, సేవాభావాన్ని మరింత పెంపొందించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



## వివేకానందనగర్‌లో గణపతి నిమజ్జనం

**సైబరాబాద్ సెప్టెంబర్ 24 (జనం వార్త):** గాయత్రి నగర్ డివిజన్-254 పరిధిలోని వివేకానంద నగర్‌లో శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం గురువారం గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తుల జయజయధ్వానాలు, మేళతాళాల నడుమ గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర నిర్వహించి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అంజయ్యతో పాటు మురళి, ముని, హరి, బాలరాజు, రమణ, నాయుడు, రాజు, అనిల్, కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## గణనాథుని కటాక్షంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

**నేతి సంతోష్ కుమార్, ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ**

**కీసర,సెప్టెంబర్ 24(జనం వార్త) :** శ్రీ వినాయక స్వామి కరుణా కటాక్షంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని శివాజీ అసోసి యేషన్ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి టిపిఎస్ కాలనీ లో శివాజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథు డికి 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. గురువారం వినాయక మండపం వద్ద విఘ్నేశ్వర స్వామికి వేద





మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన పూజా కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందుకున్నారు. అనంతరం నేతి సంతోష్ కుమార్,ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులు ప్రసాదా న్ని స్వీకరించారు. ఈ సందర్భంగా శివాజీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ప్రజల లో భక్తిభావంతో పాటు ఐక్యత,సోదరభావాన్ని పెంపొందించేం దుకు దోహదపడతాయని అన్నారు. కాలనీవాసులు ప్రతి సంవత్సరం కలిసికట్టుగా వినాయక ఉత్సవాలను నిర్వహిం చడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ అసోసియేషన్ సభ్యులు మణికాంత్ రెడ్డి,చందు, అజయ్,సంతోష్ కుమార్,శ్రీకాంత్,శ్రావణ్, విశ్వా,విక్కీ,లికిత్ రెడ్డి, అనంత్ రెడ్డి గౌతం, మహిళలు,యువకులు, స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వినాయక చవితి ఉత్సవాలు భక్తి భావాన్ని పెంపొందిస్తాయి

**మాజీ కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి**

**కీసర,సెప్టెంబర్ 24 (జనంవార్త) :** శ్రీవినాయక స్వామి చవితి ఉత్సవాలు ప్రజలలో భక్తి భావాలను పెంపొందిస్తాయని మాజీ కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని ఎస్.వి నగర్ రోడ్ నెంబర్-3లో శ్రీ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన లంభోదరుణ్ణి నీ మాజీ కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి దర్శించుకొని, స్వామివారి కటాక్షంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రజలు అందరు విఘ్నేశ్వర స్వామి దీవెనలు ప్రజలందరికీ ఉండాలని స్వామివారిని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొత్త గోపాల్ రెడ్డి,మామిడి నవీన్ రెడ్డి,మర్రి సుధాకర్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి,సురేందర్ రెడ్డి, బాలాజీ నాయక్,పులి సిద్దులు,రమణ రెడ్డి,సన్విత్, మరియు చెంచి రెడ్డి,శేఖర్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,పైళ్ల మల్లారెడ్డి,యాకయ్య,రామచంద్ర రెడ్డి,పంజాల నర్సింహా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## 25 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**సికింద్రాబాద్ :** కంటోన్మెంట్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో గురువారం 25 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే శ్రీ గణేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో చెక్కుల మంజూరుకు ఎక్కువ సమయం పట్టేదని, ప్రస్తుతం 3-4 నెలల్లోనే మంజూరు అవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# హైదరాబాదులో ఘనంగా షర్మిల కుమార్తె ఎంగేజ్మెంట్

- హాజరైన సీఎం రేవంత్ రెడ్డి దంపతులు
- స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొంగులేటి హాజరు

**హైదరాబాద్:** ఆహ్వానితుల సందడి.. ఆత్మీయుల అభినందనలు.. రాజకీయ ప్రముఖుల రాకతో హైదరాబాద్ శివారులోని కొత్వాల్‌గూడ గురువారం ప్రత్యేక వేడుకకు వేదికైంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కుమార్తె అంజిలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డి నిశ్చితార్థం కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి వారి భవిష్యత్తు సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. నిశ్చితార్థ వేడుకకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని అంజిలి, రఘురామ్ రెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు. సన్నిహితుల మధ్య జరిగిన ఈ వేడుకలో ఇరు కుటుంబాల్లో ఉత్సాహభరిత వాతావరణం కనిపించింది. నిశ్చితార్థంతో షర్మిల కుటుంబంలో పెళ్లి వేడుకలకు అధికారికంగా శ్రీకారం చుట్టినట్లయింది. కుమార్తె వివాహానికి సంబంధించిన కార్యక్రమాల తేదీలను షర్మిల ఇప్పటికే ప్రకటించారు. సెప్టెంబర్ 24న నిశ్చితార్థం జరగనుందని ముందుగానే వెల్లడించగా.. నవంబర్ 25న వివాహం, డిసెంబర్ 5న రిసెప్షన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివాహానికి సంబంధించిన తొలి ఆహ్వాన పత్రికను ఇడుపులపాయలోని తన తండ్రి, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద ఉంచి ఆశీస్సులు తీసుకున్నట్లు షర్మిల వెల్లడించారు. ఇదిలా ఉండగా.. కుమార్తె వివాహ ఆహ్వానం కోసం తన సోదరుడు వైఎస్ జగన్‌ను కలవనున్నారన్న అంశంపై కొంతకాలంగా రాజకీయ చర్చ సాగింది. దీనిపై షర్మిల ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. తన కుమార్తె వివాహానికి అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానిస్తానని ఆమె ప్రకటించారు. ఆహ్వాన కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నిశ్చితార్థ వేడుకకు వివిధ రాజకీయ ప్రముఖులు హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. నిశ్చితార్థం పూర్తవడంతో ఇప్పుడు నవంబర్ 25న జరగనున్న వివాహ వేడుకపై కుటుంబ సభ్యులు, సన్నిహితుల్లో ఆసక్తి నెలకొంది.



# ఖైరతాబాద్ బరిలో బీజేపీదే గెలుపు

## దానం వ్యవహారంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

### కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫిరాయింపుల తీరుపై విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24:** ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానంలో మరోసారి ఎన్నికల వాతావరణం ఏర్పడనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో.. ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం సుగమమైందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు గురువారం దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసి హైకోర్టు నిర్ణయాన్ని కొనసాగించింది. ఈ పరిణామంపై స్పందించిన కిషన్‌రెడ్డి.. తెలంగాణలో కొనసాగుతున్న పార్టీ మార్పుల రాజకీయాలకు ఈ తీర్పు ఒక ముఖ్యమైన పరిణామమని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి ప్రజాప్రతినిధులను తీసుకెళ్లడం, అనంతరం వారి రాజకీయ భవిష్యత్తును కొనసాగించడం వంటి పరిణామాలపై ఆయన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను విమర్శించారు.

### దానం వ్యవహారాన్ని గుర్తుచేసిన కిషన్‌రెడ్డి

2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న ఆయనను అనర్హుడిగా ప్రకటించి ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా పేర్కొంది. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆ తీర్పులో జోక్యం చేసుకోవడానికి కారణం లేదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ కిషన్‌రెడ్డి.. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ నుంచి పలువురు ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి తీసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకున్న తీరును ఆయన ప్రస్తావించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో అధికారంలో ఉన్న పార్టీ, ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు భిన్నమైన వైఖరిని అవలంబిస్తున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫిరాయింపులను ప్రశ్నించి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని అనుసరించడం సరైన రాజకీయ పద్ధతి కాదని అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును రాజకీయ అవసరాల కోసం మార్చే ప్రయత్నాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపుతాయని ఆయన పేర్కొన్నారు. దానం నాగేందర్ అంశంలో వెలువడిన న్యాయపరమైన పరిణామాన్ని ఈ వ్యవహారంపై స్పష్టమైన సందేశంగా ఆయన అభివర్ణించారు.

### ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికపై ఫోకస్

దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన నేపథ్యంలో త్వరలో అక్కడ ఉప ఎన్నిక జరగాల్సి ఉంటుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఎన్నికలో ప్రజలు తమకు నచ్చిన ప్రతినిధిని మరోసారి ఎన్నుకునే అవకాశం పొందుతారని అన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఫిరాయింపుల రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు తమ తీర్పును ఇవ్వనున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే, ఎన్నికల ఫలితాలపై కిషన్‌రెడ్డి చేసినది రాజకీయ అంచనా మాత్రమే. ఉప ఎన్నికకు సంబంధించిన అధికారిక షెడ్యూల్, ఫలితం వంటి అంశాలు ఎన్నికల ప్రక్రియలోనే స్పష్టమవుతాయి. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో మాత్రం దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు నిర్ణయం కొనసాగుతోంది.

# అంగన్వాడి, బస్తీ దవాఖానలో ఇలాంటి పరిస్థితులా..?

## ఏనుగు సుదర్శన్‌రెడ్డి మండిపాటు

- కిష్టాపూర్‌లోని చిన్నారుల కేంద్రాన్ని పరిశీలించిన ఏనుగు సుదర్శన్‌రెడ్డి
- అంగన్వాడి, బస్తీ దవాఖానలో వసతులపై మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ ఆగ్రహం
- అంగన్వాడిలో మరుగుదొడ్డి లేకపోవడంపై ఏనుగు సుదర్శన్‌రెడ్డి అసంతృప్తి
- బస్తీ దవాఖానలోనూ అవసరమైన సౌకర్యాలు సమకూర్చాలని డిమాండ్
- తాగునీరు, విద్యుత్ నుంచి భవన భద్రత వరకు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ



**మేడ్చల్ :** కిష్టాపూర్ డివిజన్‌లోని అంగన్వాడి కేంద్రం, బస్తీ దవాఖానలో నెలకొన్న వసతుల పరిస్థితిపై మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా కేంద్రాలను సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను పరిశీలించి సిబ్బంది, స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులు ప్రతిరోజూ వచ్చే అంగన్వాడి కేంద్రంలో మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడాన్ని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. బాలలకు విద్యతో పాటు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడాల్సిన కేంద్రాల్లోనే ఇలాంటి మౌలిక సదుపాయాల లోటు ఉండటం సరికాదన్నారు. పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన చోటే వసతులు అందుబాటులో లేకపోవడం పట్ల అధికారుల తీరును తప్పుబట్టారు. అంగన్వాడి, బస్తీ దవాఖానల్లో ప్రజలకు అవసరమైన సదుపాయాలన్నింటినీ అందుబాటులోకి తీసుకురావాలని సుదర్శన్‌రెడ్డి కోరారు. మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ కనెక్షన్, పరిశుభ్రమైన వాతావరణం, సురక్షిత భవనాలు, అవసరమైన ఫర్నిచర్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు వంటి వర్గాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థానిక పరిస్థితులను అధికారులు స్వయంగా పరిశీలించి సమస్యల జాబితాను రూపొందించాలని ఆయన కోరారు. ఒక్కసారి పరిశీలన చేసి వదిలేయకుండా ప్రతి సమస్య పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించి పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. చేపట్టిన చర్యలు, వాటి పురోగతిని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సేవా కేంద్రాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాధనంతో కొనసాగుతున్న వ్యవస్థలో కనీస సదుపాయాలు కూడా అందకపోవడం ఆమోదయోగ్యం కాదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ప్రజల తరఫున తమ పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జిల్లా మహిళా మోర్చా అధికార ప్రతినిధి బచ్చు కృష్ణ ప్రియ, సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, యువ నాయకులు గుమ్మడిదల రాజేష్, మేడ్చల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జకట ప్రేమ్ దాస్, కార్యదర్శి వేముల సత్యనారాయణ రెడ్డి, నాయకులు దగ్గు రాజు, గోపు నాగరాజుతో పాటు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# చిన్నారుల మధ్య భద్రారెడ్డి బర్త్‌డే వేడుకలు

## భద్రారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన తుడుం గణేష్

**మేడ్చల్, సెప్టెంబర్ 24 :** మల్లారెడ్డి హెల్త్ సిటీ ఛైర్మన్, బీఆర్ఎస్ యువ నాయకుడు డాక్టర్ చామకూర భద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలు సేవా కార్యక్రమాలతో సాగాయి. మేడ్చల్ మున్సిపాలిటీ 4వ వార్డు మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భద్రారెడ్డిని ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భద్రారెడ్డితో కేక్ కట్ చేయించి, శాలువా, గజమాలతో సత్కరించారు. అనంతరం పూడూరు--కిష్టాపూర్ డివిజన్ పరిధిలోని కిస్టాపూర్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులకు నోట్‌బుక్స్, పెన్నులు, బిస్కెట్లను అందజేశారు. తుడుం గణేష్ మాట్లాడుతూ డాక్టర్





భద్రారెడ్డి పేదలకు వైద్య సహాయం అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతున్నారని తెలిపారు. ఈ శిబిరాల ద్వారా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని అన్నారు. తన తండ్రి మల్లారెడ్డి చూపిన మార్గంలో ముందుకు సాగుతూ ప్రజా సేవకు ప్రాధాన్యం ఇస్తున్నారని గణేష్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ యువ నాయకుడిగా పార్టీ బలోపేతానికి భద్రారెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమార్, సాయి గౌడ్, కాశీ, శ్యామ్, నరసింహతో పాటు కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఇతరులు పాల్గొన్నారు.



# జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ :** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)విషయంపై ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'ఓటు చోరీ' ద్వారా ఎంపీలుగా గెలిచిన వారు చేసిన చట్టాలు చెల్లబోవని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. మహారాష్ట్ర, హరియాణాలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ లేవనెత్తిన తర్వాతే.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు.. సీఈసీకి ఎస్ఐఆర్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారని అన్నారు. జ్ఞానేశ్‌కుమార్ అప్రూవర్‌గా మారాలని.. అది దేశ ప్రయోజనాలకు మంచిదని వ్యాఖ్యానించారు. ప్రస్తుత సీఈసీని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా ఎంపిక చేశారని రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుత గందరగోళానికి ఆయనే కారణమని ఇద్దరు కమిషనర్లు చెబుతున్న నేపథ్యంలో.. ఎంపిక చేసిన వాళ్లే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# చిన్నారుల ఆరోగ్యంపై నిఘా..

## అంగన్‌వాడీల్లో ఆహార నాణ్యతపై బీజేపీ మహిళా నేత ఆరా

- గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందుతున్న ఆహార పదార్థాలపై బచ్చు కృష్ణప్రియ పరిశీలన
- తల్లులతో మాట్లాడి పథకాల అమలు, ఆహార పంపిణీ తీరును తెలుసుకున్న బీజేపీ నాయకురాలు
- అంగన్‌వాడీ సిబ్బందికి సన్మానం.. చిన్నారులకు తినుబండారాల పంపిణీ




**మేడ్చల్, సెప్టెంబర్ 24 :** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న పౌష్టికాహార కార్యక్రమాల అమలు తీరును బీజేపీ నాయకురాలు బచ్చు కృష్ణప్రియ పరిశీలించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆమె పలు కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను గమనించారు. ఈ సందర్భంగా కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే ఆహారంపై ప్రత్యేకంగా వివరాలు సేకరించారు. గుడ్లు, పాలు, పప్పు, వివిధ రకాల పోషక పదార్థాలు, భోజనం, కూరగాయల సరఫరా వంటి అంశాలను పరిశీలించారు. నిర్ణీత విధానం ప్రకారం ఆహారం అందుతున్నదా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు అక్కడికి వచ్చిన తల్లులతో నేరుగా మాట్లాడారు. పిల్లలకు అవసరమైన పోషక విలువలు కలిగిన ఆహారం అందేలా చూడటం కీలకమని బచ్చు కృష్ణప్రియ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు భోజనం, పోషకాహారం అందుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనం చేరేందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కేంద్రాల్లో సౌకర్యాల పరంగా ఎదురవుతున్న ఇబ్బందులు, ఆహార సరఫరాకు సంబంధించిన సమస్యలు లేదా ఇతర లోపాలు ఉంటే తమకు తెలియజేయాలని తల్లులకు సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలకు సంబంధించిన అంశాల్లో ఏమాత్రం నిర్లక్ష్యం ఉండకూడదని అన్నారు. తర్వాత అక్కడ పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను శాలువాలతో గౌరవించారు. పిల్లలకు తినుబండారాలు అందించి వారితో కొంత సమయం గడిపారు. వారి విద్యాభ్యాసం, ఆరోగ్య పరిస్థితి, కేంద్రాల్లో అందుతున్న వసతులపై చిన్నారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, వేముల సత్యనారాయణ రెడ్డి, రామన్నగారి శ్రీనివాస్ గౌడ్, భాగ్యరెడ్డి, జనరల్ సెక్రటరీ జాకట ప్రేమ్ దాస్, నాగరాజు, రాజేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.







# పురుషులు హౌస్ హస్బెండ్‌గా ఎందుకు ఉండకూడదు?

## మదురై ధర్మాసనం

**చెన్నై:** మహిళలు హౌస్ వైఫ్‌లా ఉన్నట్లు పురుషులు హౌస్ హస్బెండ్‌గా ఎందుకు ఉండకూడదని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్నించింది. తిరువణ్ణామలైకి చెందిన వైద్య దంపతుల విడాకులకు సంబంధించి జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ సుమతితో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వుల్లో... మారుతున్న సమాజంలో మహిళల ఉపాధికి వివాహం అడ్డంకిగా ఉందని భావించి వైవాహిక జీవితానికి దూరమయ్యే వారి సంఖ్య పెరుగుతోందని పేర్కొంది. కుటుంబ వ్యవస్థలో, పని వాతావరణంలో స్త్రీ, పురుషులు ఇద్దరికి సమాన హక్కులు, అవగాహన అవసరం అని తెలిపింది. ఉద్యోగం చేసే మహిళలు తమ ఉద్యోగం, వృత్తిపరమైన ఎదుగుదలకు వివాహాన్ని అడ్డుగా భావించి భయపడుతున్నారని అభిప్రాయం వ్యక్తం చేసింది. దీంతో ఇటీవలి కాలంలో వివాహం చేసుకోకుండా ఉండిపోతున్న మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తెలిపింది. ఈ పరిస్థితి మారాలంటే ఇంటి బాధ్యతలను భర్తలు పంచుకునేందుకు ముందుకు రావాలని సూచించింది. సమాజంలో మహిళలు హౌస్ వైఫ్‌గా ఉన్న విధంగా.. అవసరమైతే పురుషులు ఇంటి బాధ్యతలు స్వీకరించే హౌస్ హస్బెండ్‌గా ఉండేందుకు సంకోచించకూడదని పేర్కొంది. స్త్రీ, పురుషులు ఈవిధంగా ఉంటేనే భవిష్యత్తులో వివాహం, కుటుంబ వ్యవస్థను రక్షించగలమని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ కేసు విషయంలో పిల్లల క్షేమాన్ని పరిగణనలోకి తీసుకుని రూ.2.50 కోట్లు ఇచ్చేందుకు భర్త అంగీకరించారు. అందుకు భార్య ఆమోదం తెలపడంతో పరస్పర అంగీకారంతో విడాకులు మంజూరయ్యాయి.

# కూల్ డ్రింక్స్ అధికంగా తాగుతున్నారా..

## అనారోగ్యం కొనితెచ్చుకున్నట్లే!



వేడి ప్రజలకు కూల్ డ్రింక్స్ తాగాలనే కోరిక కలిగిస్తుంది. ముఖ్యంగా తీపి రుచి, గ్యాస్ కలిగిన సాఫ్ట్ డ్రింక్స్ తాగడం ద్వారా వెంటనే దాహం తగ్గినట్లు అనిపిస్తుంది. అందుకే వేసవిలో సాఫ్ట్ డ్రింక్స్ వినియోగం గణనీయంగా పెరుగుతుంది. అయితే వీటిలో ఉండే అధిక చక్కెర, కెఫీన్ వంటి పదార్థాలు అలవాటుగా మారే ప్రమాదం ఉంది. పరిశోధనల ప్రకారం, ఈ పానీయాలను తరచుగా తీసుకోవడం దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది. సాఫ్ట్ డ్రింక్స్‌లో ఉండే అధిక ఫ్రుక్టోజ్ శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు దారితీస్తుంది. ఇది టైప్-2 డయాబెటిస్‌కు ముందస్తు సంకేతంగా పరిగణించబడుతుంది. అదనంగా, అధిక చక్కెర లివర్‌లో కొవ్వుగా మారి నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ సమస్యను కలిగించే అవకాశం ఉంది. దంతాల ఆరోగ్యంపైనా ఇవి ప్రతికూల ప్రభావం చూపుతాయి. సోడాలో ఉండే ఫాస్ఫారిక్, కార్బోనిక్ యాసిడ్లు దంతాల పైపొరను దెబ్బతీసి దంతాలు పుచ్చిపోవడానికి కారణమవుతాయి. అలాగే ఇవి కాల్షియం శోషణను తగ్గించి ఎముకలను బలహీనపరచి ఆస్టియోపోరోసిస్ ప్రమాదాన్ని పెంచుతాయి.

### దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు

సాఫ్ట్ డ్రింక్స్‌లో పోషక విలువలు చాలా తక్కువగా ఉంటాయి. ఇవి కేవలం ఎంప్టీ కాలరీలు మాత్రమే ఇస్తాయి. ఫలితంగా, శరీరానికి అవసరమైన పోషకాలు అందకుండా అదనపు కాలరీలు చేరి అస్వస్థకరమైన ఆహార అలవాట్లకు దారితీస్తాయి. అదేవిధంగా, లిక్విడ్ కాలరీలు తృప్తి కలిగించకపోవడంతో మరింత ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. దీని వల్ల బరువు పెరగడం, ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. సాఫ్ట్ డ్రింక్స్‌లో కెఫీన్ అధికంగా ఉంటుంది. కెఫీన్ అధికంగా ఉండే సాఫ్ట్ డ్రింక్స్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల గుండె వేగం పెరగడం, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా రాత్రి సమయంలో వీటిని తీసుకోవడం నిద్ర నాణ్యతను దెబ్బతీస్తుందని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో వీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ సమస్య కూడా రావచ్చు. కెఫీన్, చక్కెర మూత్ర విసర్జనను పెంచి శరీరంలో నీటి శాతం తగ్గించే అవకాశం ఉంది. ఇక గుండె ఆరోగ్యంపై కూడా వీటి ప్రభావం ఉంటుంది. ప్రతిరోజూ చక్కెర పానీయాలు తీసుకునే మహిళల్లో గుండె జబ్బుల ప్రమాదం దాదాపు 20 శాతం వరకు పెరుగుతుందని ఒక అధ్యయనం చెబుతోంది. రక్తపోటు, ట్రైగ్లిజరైడ్స్ పెరగడం వంటి సమస్యలు కూడా గమనించవచ్చు. అధికంగా సాఫ్ట్ డ్రింక్స్ తీసుకోవడం కిడ్నీలపై ఒత్తిడిని పెంచుతుంది. వీటిలో ఫాస్ఫారిక్ యాసిడ్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీ స్టోన్స్, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. కనుక వేసవిలో సాఫ్ట్ డ్రింక్స్ ను తీసుకోకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



### సహజ పానీయాలు మంచిది..

ఇక సాఫ్ట్ డ్రింక్స్‌కు బదులుగా ఆరోగ్యకరమైన పానీయాలను ఎంచుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. సాధారణ నీరు ఉత్తమమైన ఎంపిక. దీనిలో నిమ్మకాయ, పండ్ల ముక్కలు కలిపి రుచిని పెంచుకోవచ్చు. హెర్బల్ టీలు చల్లగా తీసుకుంటే రిఫ్రెషింగ్‌గా ఉండటంతో పాటు కాలరీలు ఉండవు. కొబ్బరి నీరు సహజ ఎలక్ట్రోలైట్స్‌తో శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. గ్యాస్ కావాలనుకునే వారికి షుగర్ లేకుండా ఉన్న స్పార్క్లింగ్ వాటర్ మంచి ఎంపిక అని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే అనేక భారతీయ సంప్రదాయ పానీయాలు కూడా మంచి ప్రత్యామ్నాయాలు అని చెప్పవచ్చు. శికంజీ, ఛాస్, సత్తు పానీయం, ఆమ్ పన్నా, కోకుమ్ శర్బత్, బెల్ శర్బత్, తండాయి, గోండ్ కతీరా వంటి పానీయాలు శరీరాన్ని చల్లబరచడంలో సహాయపడతాయి. అదనంగా, పండ్లు, కూరగాయలతో తయారు చేసే స్మూతీలు పోషకాలు అందించడంతో పాటు తృప్తిని ఇస్తాయి.



# జామ ఆకు

## ప్రయోజనాలు బాగు...

జామ ఆకుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జామ ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి కడుపు పూతల నుంచి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతాయి. దగ్గు, దురద మొదలైన వాటితో బాధపడుతున్నవారు జామ ఆకులను తినాలి. ఎందుకంటే వీటిలో శరీరానికి ఉపశమనాన్ని అందించే యాంటీ అలర్జీ లక్షణాలు ఉంటాయి. అంతేకాదు జామ ఆకులను వివిధ రూపాల్లో తీసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది. జామ ఆకులను క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉంటే మగవారికి మేలు చేస్తుంది. సంతానలేమి సమస్యను దూరం చేస్తుంది. జామ ఆకుల సారాన్ని తీసుకుంటే స్పెర్మ్ నాణ్యత, కౌంట్ పెరుగుతుంది. జామ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుంచి ఉపశమనం అందిస్తాయి. జామ ఆకులను రెగ్యులర్‌గా తింటే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది.

జామపండుతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో జామ ఆకులతో కూడా అంతకుమించి ప్రయోజనాలు పొందవచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జామాకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ మైక్రోబయిల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. జామ ఆకులు క్యాలరీ ఫ్రీ. ఇవి బరువు తగ్గడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. జామ ఆకులను పచ్చిగా తిన్నా కూడా రుచిగా ఉంటాయి. కావాలనుకుంటే జ్యూస్‌లా చేసుకుని తాగవచ్చు. జామ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మం ముడతలు మాయమవుతాయి. మొటిమలు, నల్ల మచ్చలను తొలగించడంతో జామ ఆకులు సహాయపడతాయి. జామ ఆకులు హైపర్ పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి. జామ ఆకుల పేస్ట్‌ను అప్లై చేసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. జుట్టును ఒత్తుగా మార్చడంలో జామ ఆకుల సారం సహాయపడుతుంది. ఈ రసం తీసుకుంటే జుట్టు మూలాల నుంచి దృఢంగా మారుతుంది. జామ ఆకుల పేస్ట్‌ను తలకు రాసుకుంటే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.



### కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి

జామ ఆకులలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి శరీరానికి సహాయపడే అనేక అంశాలు ఉన్నాయి. జామ ఆకుల టీ తాగితే రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి, మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. అంతే కాదు శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండె జబ్బుల సమస్యలను దూరం చేస్తుంది. పిండి పదార్థాలు చక్కెరలుగా మారడాన్ని జామ ఆకుల సారం నియంత్రిస్తుంది. దాంతో మధుమేహం అదుపులో ఉంటుంది. ఊబకాయంతో బాధపడేవారు జామ ఆకుల టీ తీసుకోవాలి. జామ ఆకులతో తయారు చేసిన టీ తాగడంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా మారుతుంది. జామ ఆకుల టీతో జీర్ణ వ్యవస్థలో ఉన్న చెడు బ్యాక్టీరియా తొలగుతుంది. ఇందులోని డైటరీ ఫైబరీ జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది. జామ ఆకులను తీసుకోవడంతో డెంగ్యూ నుంచి వేగంగా కోలుకోవచ్చు. జామ ఆకులను తీసుకుంటే రక్తంలో ప్లేట్‌లెట్స్ సంఖ్య వేగంగా పెరుగుతుంది. జ్వరం తీవ్రత సైతం తగ్గుతుంది.



పండగలు సమీపిస్తున్నాయి. ఈ సమయంలో కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు పలు రాయితీలు అందుబాటులోకి వస్తుంటాయి. ఇదే సమయంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు అందుబాటులోకి వస్తుండటంతో చాలా సంస్థలు ఈసారి పండగల కొనుగోళ్లకు వెలుగులు వస్తాయని భావిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు క్రెడిట్ కార్డు సంస్థలూ ప్రయత్నిస్తున్నాయి. కొత్తగా కార్డులు జారీ చేసేందుకు పోటీ పడుతున్నాయి. పూర్తిగా ఉచితం అంటూ, ఆకర్షిస్తున్నాయి. మరి, ఈ మాటల్లో నిజమెంత? అని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దీనికోసం కొన్ని అంశాలను పరిశీలించాలి.



# క్రెడిట్ కార్డు ఉచితం కాదు




సాధారణంగా క్రెడిట్ కార్డులను జారీ చేసే సమయంలో బ్యాంకులు కొన్ని రుసుములను వసూలు చేస్తుంటాయి. స్టేట్‌మెంట్ ఫీజు, కార్డు పోతే కొత్త కార్డు ఇచ్చేందుకు ఫీజులాంటివి ఇందులో ఉంటాయి. వీటన్నింటి గురించి ఎక్కడా చెప్పరు. కానీ, కార్డు బిల్లులో వీటిని గమనించవచ్చు.

- క్రెడిట్ కార్డు బిల్లులను సకాలంలో చెల్లించినప్పుడు, ఎలాంటి వడ్డీ ఉండదు. సాధారణంగా ఉచిత వడ్డీ కాలం 50 రోజుల వరకూ ఉంటుంది. ఇది పూర్తిగా మీ కార్డు బిల్లింగ్ తేదీపై ఆధారపడి ఉంటుంది. బిల్లు మొత్తాన్ని పూర్తిగా చెల్లించాలి. ఆలస్యం చేస్తే రుసుముతోపాటు, వడ్డీ విధిస్తుంది.
- ప్రతి క్రెడిట్ కార్డుకూ గరిష్ఠ వినియోగ పరిమితి ఉంటుంది. ఒక బిల్లింగ్ సైకిల్‌లో ఆ మేరకే దాన్ని వినియోగించేందుకు వీలవుతుంది. కార్డుదారుడి క్రెడిట్ స్కోరు, చెల్లింపుల చరిత్ర, ఆదాయం, వినియోగ నిష్పత్తిలాంటివి పరిగణనలోకి తీసుకొని, పరిమితి నిర్ణయిస్తారు. తొలిసారి కార్డు తీసుకున్న వారికి ఇది కాస్త తక్కువగా ఉండొచ్చు. క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తూ ఉంటే, కొంత కాలం తర్వాత పరిమితిని పెంచే అవకాశం ఉంటుంది.

## ఏటీఎంలలో నగదు తీసుకోవచ్చు

- క్రెడిట్ కార్డులను ఉపయోగించి ఏటీఎంలలో నగదు తీసుకోవచ్చు. కానీ, దీనికి నెలకు 3–4 శాతం వరకూ వడ్డీ ఉంటుందని మర్చిపోవద్దు.
- జాగ్రత్తగా వాడితేనే క్రెడిట్ కార్డు మంచిది. నిర్లక్ష్యంగా ఉన్నామా.. అప్పుల ఊబిలోకి నెట్టేస్తుంది. వీలైనంత వరకూ అప్రమత్తంగా ఉండి, అన్ని వివరాలూ తెలుసుకున్నాకే, కార్డుతో కొనుగోళ్లు చేయండి. అప్పుడే మీకు ఇబ్బందులు లేకుండా పండగ షాపింగ్ పూర్తవుతుంది.

## గడువులోపు బిల్లును చెల్లించడమే మేలు



- చాలామంది మొత్తం బిల్లు చెల్లించకుండా.. కనీస బిల్లు మొత్తాన్ని చెల్లిస్తూ ఉంటారు. ఇది సాధారణంగా బిల్లులో 5 శాతం వరకూ ఉంటుంది. ఈ కనీస మొత్తాన్ని చెల్లించడం వల్ల క్రెడిట్ కార్డు అమల్లో ఉంటుంది. కానీ, మిగతా మొత్తానికి వడ్డీ తప్పదు. కాబట్టి, గడువులోపు మొత్తం బిల్లును చెల్లించడమే ఎప్పుడూ మేలు. ఒకవేళ పెద్ద మొత్తంలో కొనుగోలు చేసినప్పుడు దాన్ని ఈఎంఐగా మార్చుకోవడం మంచిది.
- క్రెడిట్ కార్డు బిల్లు వచ్చినప్పుడు దాన్ని జాగ్రత్తగా గమనించాలి. ఏం కొన్నారు? కొన్న బిల్లులూ.. స్టేట్‌మెంట్‌లో వచ్చిన మొత్తం సరిగానే ఉందా? వడ్డీ, రుసుముల్లాంటివి ఏమైనా ఉన్నాయా? సరి చూసుకోవాలి. లావాదేవీల్లో ఏదైనా వ్యత్యాసం ఉంటే, కార్డు సంస్థ దృష్టికి తీసుకెళ్లాలి.
- కార్డు బిల్లింగ్ తేదీలను జాగ్రత్తగా గమనించాలి. మీ కార్డు బిల్లు ఒక నెలలో రెండో తేదీన బిల్లింగ్ ముగిస్తే.. మూడో తేదీ నుంచి కొత్త బిల్లింగ్ ప్రారంభమవుతుంది. బిల్లింగ్ ప్రారంభంలో కొన్నప్పుడు మాత్రమే 50 రోజుల వ్యవధి లభిస్తుంది. రోజులు గడుస్తున్న కొద్దీ ఈ వ్యవధి తగ్గుతుంది.
- రివార్డులు, నగదు వెనక్కి తదితరాలను పరిశీలించాలి. రివార్డు పాయింట్ల ద్వారా కొన్ని వస్తువుల కొనుగోలుపై రాయితీ లభిస్తుంది. ప్రయాణాల్లో, హోటల్ బుకింగ్‌లోనూ డిస్కౌంట్లు లభిస్తాయి. నగదు వెనక్కి ఆఫర్లు ఉన్నప్పుడు.. వెంటనే ఆ ప్రయోజనం లభిస్తుంది. కార్డుతో కొనేటప్పుడు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి.

# ఫోన్లను ఈ ప్రదేశంలో ఉంచడం చాలా ప్రమాదకరం..!



స్మార్ట్ ఫోన్లు అనేవి ప్రస్తుతం మన నిత్య జీవితంలో భాగం అయిపోయాయి. ఇంకా చెప్పాలంటే అవి మన నిత్యావసర వస్తువుగా మారాయి. ఫోన్లు లేకపోతే ఈ ప్రపంచాన్ని అసలు ఊహించుకోలేం అన్నంతగా పరిస్థితి మారింది. చాలా పనులను మనం ఫోన్లతో చక్కబెట్టుకుంటున్నాం. ఇప్పుడు 5జి అందుబాటులో ఉండడంతో చాలా వేగంగా అనేక పనులను చేసుకోగలుగుతున్నాం. అయితే అంతా బాగానే ఉంది కానీ ఫోన్లను వాడడంలోనే అసలు సమస్యంతా ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫోన్లను ఎక్కడ పడితే అక్కడ పెట్టి ఉపయోగించకూడదని వారు హెచ్చరిస్తున్నారు. ఫోన్లను చాలా మంది అసలు ఏయే ప్రదేశాల్లో పెడుతుంటారు.. ఎలా వాడుతుంటారు.. వాటి వల్ల మనకు ఎలాంటి హాని కలుగుతుంది.. అన్న వివరాలను వైద్యులు తెలియజేస్తున్నారు.

## చార్జర్‌పై పెట్టడం..

చాలా మంది ఫోన్లను చార్జింగ్ పెట్టి వాటిని కింద పెట్టేందుకు టేబుల్, స్టూల్ లాంటిది ఏదీ లేదని చెప్పి వాటిని చార్జర్‌పైనే పెడతారు. కానీ ఇలా చేయరాదు. దీని వల్ల రేడియేషన్ బాగా వస్తుందని వైద్యులు అంటున్నారు. కనుక ఫోన్లను చార్జింగ్ పెట్టినప్పుడు వాటిని చార్జర్లపై ఉంచరాదు. అలాగే ఓవర్ నైట్ చార్జింగ్ కూడా ఫోన్లను పెట్టరాదు. దాని వల్ల ఫోన్లు పేలిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే చాలా మంది దిండు కింద ఫోన్లను పెట్టి నిద్రిస్తారు. ఇలా చేయకూడదు. ఇలా చేస్తే శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. పలు అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా చర్మ సమస్యలు వస్తాయి. కనుక నిద్రించేటప్పుడు ఫోన్లను దిండ్ల కింద అస్సలు పెట్టరాదు.

## జేబుల్లో ఉంచడం..

అమ్మాయిలకు ఎక్కువగా ఫోన్లను వెనుక జేబులో పెట్టుకునే అలవాటు ఉంటుంది. కానీ ఇలా చేయడం వల్ల ఫోన్ నుంచి వచ్చే రేడియేషన్ కడుపు నొప్పి, కాళ్ల నొప్పిని కలిగిస్తుంది. కనుక ఫోన్లను బ్యాక్ పాకెట్లలో పెట్టరాదు. అలాగే పురుషులు ఎక్కువగా ఫోన్లను ప్యాంటు ముందు జేబులో పెడతారు. ఇలా చేస్తే ఫోన్ల నుంచి వచ్చే రేడియేషన్ వల్ల వీర్య కణాలు నాశనం అవుతాయి. దీంతో సంతానం కలిగేందుకు అవకాశం తక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే చాలా మంది నిద్రించేటప్పుడు తల పక్కన ఫోన్లను పెట్టి పడుకుంటారు. ఇలా చేయడం వల్ల ఫోన్ నుంచి విపరీతమైన రేడియేషన్ వస్తుంది. ఇది మెదడుపై ప్రభావం చూపిస్తుంది. దీని వల్ల మెదడులో కణతులు ఏర్పడే అవకాశం ఉంటుంది. అది బ్రెయిన్ ట్యూమర్‌కు దారి తీయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

## చార్జింగ్ పెట్టినప్పుడు..

ఇక చాలా మంది ఫోన్‌ను చార్జింగ్ పెట్టినా కూడా ఏదైనా కాల్ లేదా మెసేజ్ వస్తే చార్జింగ్ అలాగే ఉంచి దాన్ని ఉపయోగించుకుంటారు. ఇలా కూడా చేయకూడదు. ఇది అత్యంత ప్రమాదకరం. దీని వల్ల ఫోన్ అధికంగా రేడియేషన్, హీట్‌కు గురై త్వరగా పేలిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే ఫోన్లకు కంపెనీలు ఇచ్చిన చార్జర్‌లనే ఎల్లప్పుడూ ఉపయోగించాలి. అలా కుదరకపోతే ఫోన్‌కు ఉన్న చార్జింగ్ కెపాసిటీకి సరిపోయే చార్జర్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. అలాగే ఫోన్‌ను చార్జింగ్ చేసిన అనంతరం కచ్చితంగా చార్జర్ ఉన్న స్విచ్ ను ఆఫ్ చేయాలి. ఈ విధంగా పలు సూచనలు పాటిస్తే ఫోన్లను జాగ్రత్తగా ఉపయోగించుకోవచ్చు. సురక్షితంగా ఉండవచ్చు.

# మూడు రోజులు బ్యాంకుల సమ్మె




ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజులపాటు సమ్మె చేయనున్న నేపథ్యంలో.. ప్రత్యామ్నాయ వ్యవస్థలపై బ్యాంకులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ఖాతాదారుల మొబైల్ నంబర్లు, ఈ-మెయిల్ ఐడీలకు సమాచారమిస్తున్నాయి. లావాదేవీల కోసం ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ ఉపయోగించాలని, నగదు కోసం ఏటీఎంలను వాడాలని సూచిస్తున్నాయి. సమ్మె మూడు రోజులైనా.. సెలవు దినాలు (నాలుగో శనివారం, ఆదివారం) కలిపితే ఐదు రోజులవుతాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెల 27న (ఆదివారం) బ్యాంకులు పనిచేయాలని ఆర్బీఐ స్పష్టం చేయడంతో, రాష్ట్రంలోని లీడ్‌బ్యాంకు మేనేజర్లు, ప్రభుత్వ రంగ బ్యాంకుల రాష్ట్ర ముఖ్యులకు ఆదేశాలు జారీ అయ్యాయి. సేవింగ్స్ ఖాతాదారులు ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వాడుతున్నారని, వారికి పెద్దగా ఇబ్బందులు ఉండబోవని బ్యాంకు కార్మిక వర్గాలు చెబుతున్నాయి. రుణాల మంజూరు, చెక్కుల చెల్లుబాటు, అధిక మొత్తంలో ఆర్‌టీజీఎస్, భారీ నగదు లావాదేవీలపై ప్రభావం ఉంటుందని వెల్లడించాయి.



## బిజినెస్



# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

### 5 లక్షల కోట్లు ఆవిరి

**ముంబాయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల కారణంగా చమురు ధరలు, బాండ్ రాబడులు పెరగడం ప్రతికూల ప్రభావం చూపింది. దీనికితోడు రూపాయి బలహీన పడడం, అమెరికా ఫెడ్ మరోసారి వడ్డీ రేట్లు పెంచుతుందన్న భయాలు సూచీలను ప్రభావితం చేశాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా పతనం కాగా.. నిఫ్టీ 23,063 పాయింట్లకు పడిపోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లు క్షీణించి రూ.480 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 74,272.40 (క్రితం ముగింపు 74,828.25) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 73,563.92 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1247.71 పాయింట్లు కుంగి.. 73,580.54 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 383.70 పాయింట్లు క్షీణించి 23,063.10 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.95గా ఉంది. సెన్సెక్స్ 30లో ఎన్‌టీపీసీ మినహా మిగతా అన్నీ షేర్లు నష్టాలను చవిచూశాయి. బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండిగో, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 105.23 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,252.79 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### మార్కెట్ పతనానికి కారణాలు ఇవీ..

- ప్రపంచవ్యాప్తంగా బాండ్లపై రాబడులు పెరగడం ఈక్విటీ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికాలో 10 ఏళ్ల యూఎస్ ట్రెజరీ రాబడులు 5.11 శాతం దాటాయి.
- 2007 తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. సాధారణంగా బాండ్ రాబడులు పెరిగితే భారత్ వంటి వర్ధమాన దేశాల ఈక్విటీ మార్కెట్‌లపై మదుపర్లకు ఆసక్తి తగ్గుతుంది.
- అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర మరోసారి పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. 100 డాలర్లకు దిగువకు చేరినట్లే చేరిన క్రూడ్.. మళ్లీ 105 డాలర్ల స్థాయికి చేరింది. యుద్ధాన్ని ముగించే విషయంలో అమెరికా- ఇరాన్ మధ్య విభేదాలు కొనసాగుతుండటం దీనికి కారణం. అమెరికా ఒత్తిళ్లకు ఏమాత్రం తలొగ్గబోమని ఐక్యరాజ్య సమితి వేదికగా ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించడం మరో కారణం.
- యూఎస్ ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లను పెంచుతుందన్న అంచనాలతో ప్రపంచ ఈక్విటీలపై ఒత్తిడి మరింత పెరిగింది. పెరుగుతున్న ముడి చమురు ధరలు ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయన్న భయాలు నెలకొన్నాయి. దీంతో అవసరమైతే మరిన్ని పెంపులు ఉంటాయని ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ మైఖేల్ బార్ పేర్కొనడం ఇందుకు నేపథ్యం.
- దేశీయంగా బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ తీసుకొచ్చిన కొత్త ప్రతిపాదనల వల్ల బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ మరింత క్షీణించడం కూడా సూచీలపై ప్రభావం చూపాయి.




# స్టాక్ మార్కెట్లలోకి ఎన్ఎస్ఈ..

### ఫ్లాట్‌గా లిస్టింగ్

సుదీర్ఘ ఎదురుచూపుల తర్వాత ఎన్నో అంచనాలతో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్.. బీఎస్ఈ ఫ్లాట్‌గా అడుగుపెట్టింది. ఇష్యూ ధరతో పోలిస్తే స్వల్పంగా 0.84శాతం ప్రీమియంతో గురువారం దలాల్ స్ట్రీట్‌లో లిస్ట్ అయ్యి మదుపర్లను నిరాశపర్చింది. ఇష్యూ ధర రూ.1,785 కాగా.. కేవలం రూ.15 లాభంతో రూ.1800 వద్ద ఎన్ఎస్ఈ షేర్ల ట్రేడింగ్ ప్రారంభమైంది. రూ.22,569 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఎన్ఎస్ఈ.. దేశంలోనే రెండో అతిపెద్ద ఐపీఓగా నిలిచింది. సెప్టెంబర్ 17న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. సెప్టెంబరు 21న ముగిసింది. ధరల శ్రేణిని రూ.1700-1785గా నిర్ణయించారు. ఈ ఐపీఓకు 5.68 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించింది. మొత్తం 8.86 కోట్లు షేర్లకు గానూ 50.21 కోట్లు బిడ్లు దాఖలయ్యాయి. ఎక్కువగా క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల నుంచి 12.68 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదుచేసింది. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 6.54 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. రిటైల్ ఇన్వెస్టర్ల కోటా నుంచి 1.31 రెట్ల సబ్‌స్క్రిప్షన్ మాత్రమే అందుకుంది. ఇక తాజా లిస్టింగ్‌తో దీని మార్కెట్ విలువ రూ.4.5 లక్షల కోట్లుగా నిలిచింది. ఈ ఎన్ఎస్ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే వచ్చింది. అంటే ఐపీఓ ద్వారా ఎన్ఎస్ఈకి ఒక్క రూపాయి కూడా రాదు. ఐపీఓలో తమ వాటాలు తగ్గించుకుంటున్న షేర్ హోల్డర్లకే పూర్తి నిధులు వెళ్లనున్నాయి. అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజీగా గుర్తింపు పొందినప్పటికీ.. విస్తరణకు గానీ, టెక్నాలజీపై గానీ ఐపీఓ నుంచి మూలధనం సమీకరించకపోవడం మదుపర్ల నిరాసక్తతకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



# వైఫల్యాలనూ మనస్ఫూర్తిగా స్వీకరిస్తా

### రెండేళ్ల పదవీకాలంపై గంభీర్

భారత ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్నాడు. మూడు ఫార్మాట్లలోనూ విజయాలతోపాటు ఓటములనూ చవిచూశాడు. మరీ ముఖ్యంగా స్వదేశంలో టెస్టు సిరీస్‌లను భారత్ కోల్పోయింది. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీతోపాటు టీ20 ప్రపంచ కప్ విజేతగా టీమ్ఇండియా నిలిచింది. తన రెండేళ్ల పదవీకాలంలో ఒడుదొడుకులను చవిచూశానని.. వైఫల్యాలను అంగీకరిస్తానని గంభీర్ తెలిపాడు. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్ మొదలుకానుంది. "ఈ రెండేళ్లు రెప్పపాటులో గడిచిపోలేదు. విజయాలతోపాటు వైఫల్యాలను కూడా చవిచూశా. ప్రధాన కోచ్ వంటి బాధ్యతను తీసుకున్నప్పుడు ఇలాంటి కష్టనష్టాలు సహజమని నమ్ముతా. మూడు ఫార్మాట్ల క్రికెట్‌లోనూ ఎన్నో విజయాలు సాధించా. ఎప్పటికీ గుర్తుండిపోతాయి. అలాగే వైఫల్యాలనూ మరిచిపోలేను. వాటిని కూడా మనస్ఫూర్తిగా స్వీకరిస్తా" అని గంభీర్ వెల్లడించాడు. "మా ఇద్దరి మధ్య కేవలం కోచ్, ప్లేయర్‌కు మధ్య ఉన్న సంబంధం మాత్రమే కాదు.. అంతకుమించి ఉంది. రోహిత్ జట్టులోకి వచ్చినప్పుడు నేను అప్పటికే సీనియర్‌ను. నా గురించి రోహిత్‌కు బాగా తెలుసు. మేమిద్దరం కలిసి ఆడినప్పుడు ఇంకా బాగుండేది. నా ఆలోచనలు ఎలా ఉంటాయో రోహిత్‌కు తెలుసు. అతడు కెప్టెన్‌గా ఉన్నప్పుడు నేను కోచ్‌గా వచ్చా. మా ఇద్దరి ఆలోచనలు వేరైనా జట్టు అవసరానికి ఏది బెటర్ అయితే అదే ఫైనల్ అవుతుంది. ఇప్పటి వరకు నేను పనిచేసిన నలుగురు సారథులతో నా అనుభవం అదే. ప్రతి ఒక్కరి దృష్టి భారత జట్టు వృద్ధిపైనే ఉంది" అని గంభీర్ తెలిపాడు.



# వెస్టిండీస్ కెప్టెన్ ప్రపంచ రికార్డు

విధ్వంసకర సెంచరీతో చెలరేగింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన మాథ్యూస్.. జింబాబ్వే బౌలర్లను ఉతికారేసింది. కేవలం 15 బంతుల్లో 26 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 182 పరుగులు చేసి త్రుటిలో డబుల్ సెంచరీని చేజార్చుకుంది. ఫలితంగా టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. అనంతరం ఈ భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 43.3 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటైంది. దీంతో 99 పరుగుల తేడాతో విండీస్ ఘన విజయం సాధించింది. జింబాబ్వే బ్యాటర్లలో మోడెస్టర్ ముపాచిక్వా టాప్ స్కోరర్‌గా నిలవగా.. విండీస్ బౌలర్లలో ఆలియా అల్లెన్ మూడు, అష్మిని మునిసార్, ఫ్లెచర్ తలా రెండు వికెట్లు పడగొట్టింది. ఇక ఈ మ్యాచ్‌లో భారీ సెంచరీతో చెలరేగిన మాథ్యూస్ పలు రికార్డులను తన పేరిట లిఖించుకుంది. వెస్టిండీస్ మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కో రు బ్యాటర్‌గా ఆమె చరిత్రకెక్కింది. ఇంతకుముందు ఈ దిగ్గజ ఆల్‌రౌం డర్ స్టెఫానీ టేలర్ (171) పేరిట ఉండేది. తాజా ఇన్నింగ్స్‌తో ఆ రికా ర్డును హేలీ మాథ్యూస్ అధిగమించింది. అదేవిధంగా వన్డేల్లో ఒకే క్యాలెం డర్ ఈయర్‌లో రెండుసార్లు 150కి పైగా పరుగులు సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా హేలీ మాథ్యూస్ నిలిచారు. ఇదే ఏడాది మేలో ఐర్లాం డ్‌తో జరిగిన తొలి వన్డేలో కూడా మాథ్యూస్ 159 పరుగులు పరుగులు చేసింది. ఇక ఓవరాల్‌గా మహిళా వన్డే క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు నమోదు చేసిన జాబితాలో మాథ్యూస్ ఐదో స్థానంలో నిలిచింది. ఈ లిస్ట్‌లో అమేలియా కేర్ (న్యూజిలాండ్)-232 అగ్రస్థానంలో ఉంది.

# విరాట్-రోహిత్.. 2027 ప్రపంచకప్ గెలవాలి

### రింకు సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు

**వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌లో స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడుతారా? అనే దానిపై కొంతకాలంగా చర్చ జరుగుతూనే ఉంది. ప్రతిష్ఠాత్మక టోర్నీకి వీరిని విస్మరించొద్దని కొందరు సూచిస్తుండగా.. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. దీంతో రో-కో భవిష్యత్తుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో టీమ్ఇండియా బ్యాటర్ రింకు సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.**



విరాట్-రోహిత్ కలిసి 2027 వన్డే ప్రపంచకప్ నెగ్గితే చూడాలని ఉందని ఆకాంక్షించాడు. "విరాట్ భాయ్, రోహిత్ భాయ్.. ఇద్దరూ లెజెండ్స్. వీరు ప్రపంచకప్‌లో ఆడాలని, ట్రోఫీ గెలుచుకునే జట్టులో భాగంగా ఉండాలని నేను మాత్రమే కాదు.. యావత్ దేశం ఆశిస్తోంది. అదే జరిగితే దేశం మొత్తానికీ అదో గొప్ప క్షణం అవుతుంది. ఎందుకంటే ఇదే వారికి చివరి ప్రపంచకప్ కావొచ్చు. ఇక, మనం చాలా కాలంగా వన్డే ప్రపంచ కప్‌ను అందుకోలేదు. చివరిసారిగా 2011లో జరిగిన మెగా టోర్నీలో విజయం సాధించాం. ఇప్పుడు గెలిస్తే రో-కోకి కూడా గొప్పగా ఉంటుంది. అందువల్ల వీరిద్దరూ జట్టులో ఉండి, దేశానికి ట్రోఫీ అందిస్తారని ఆశిస్తున్నా" అని రింకు వ్యాఖ్యానించాడు. 2024లో పొట్టి ప్రపంచకప్ గెలిచి సంతోషంగా, సంతృప్తిగా అంతర్జాతీయ టీ20లకు గుడ్‌బై చెప్పారు రో-కో. ఆ తర్వాత ఏడాదిలోనే టెస్టులకూ వీడ్కోలు పలికారు. అప్పటి నుంచి మిగిలిన ఏకైక ఫార్మాట్ వన్డేల్లో వీరు ఎంతకాలం కొనసాగుతారనే ప్రశ్నలు ఎదురవుతూనే ఉన్నాయి. వయసు, ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకుంటే వచ్చే ఏడాది వీరిని వన్డే ప్రపంచకప్‌లోకి తీసుకుంటారా? లేదా అనేదానిపై సందేహాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇటీవల రోహిత్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడనే వార్తలూ వినిపించాయి. వాటికి చెక్ పెడుతూ లార్డ్స్‌లో శతకంతో అదరగొట్టాడు హిట్‌మ్యాన్. ఈ నెలాఖరులో సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీరిద్దరూ ఆడనున్నారు. కోహ్లీ ఇప్పటి వరకు 314 వన్డేల్లో 14,941 పరుగులు సాధించాడు. ఇందులో 54 సెంచరీలు, 79 అర్ధశతకాలున్నాయి. రోహిత్ 288 వన్డే మ్యాచుల్లో 11,895 పరుగులు చేశాడు. ఇందులో 34 సెంచరీలు, 62 అర్ధశతకాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆరు ఇన్నింగ్స్ ఆడిన విరాట్.. 106 స్ట్రైక్ రేటుతో 384 పరుగులు చేశాడు. రోహిత్ 9 ఇన్నింగ్స్‌ల్లో 379 పరుగులు నమోదు చేశాడు.

# మిక్స్‌డ్ రిలేలో భారత్‌కు రజతం

జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల పతకాల వేట కొనసాగుతోంది. తాజాగా మహిళల 10,000 మీటర్ల పరుగు పందెంలో భారత స్ప్రింటర్ సీమా కుమారి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. రేసును 32:50.05 నిమిషాల్లో ముగించిన సీమా మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఈ విభాగంలో బహ్రెయిన్‌కు చెందిన విన్‌ఫ్రెడ్ యావి 32:39.18 సమయంతో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించగా.. జపాన్ అథ్లెట్ నోజోమి తనకా (32:41.54) రజత పతకాన్ని గెలుచుకుంది. మరోవైపు మిక్స్డ్ 4ఇ400 మీటర్ల రిలే రేసులో భారత బృందం రజత పతకాన్ని కైవసం చేసుకుంది. రేసు ప్రారంభంలో భారత్ కాస్త వెనుకబడినప్పటికీ.. చివరిలో విశాల్ తెన్నరసు, విత్య రామ్‌రాజ్‌లు అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇవ్వడంతో 3:14.46 నిమిషాల్లో పూర్తి చేసి సిల్వర్ మెడల్‌ను దక్కించుకుంది. ఈ రజతంతో కలిపి ప్రస్తుతం ఆసియా క్రీడల్లో భారత్ మొత్తం పతకాల సంఖ్య 17కు చేరింది.




# ఆస్ట్రేలియాతో మ్యాచ్.. విజయం దిశగా భారత్

పుదుచ్చేరి వేదికగా ఆస్ట్రేలియా-ఎతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో భారత్-ఎ జట్టు పట్టు బిగించింది. 363 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ జట్టుకు భారత బౌలర్లు షాకిచ్చారు. స్పిన్నర్ తనుష్ కొటియన్, పేసర్ తుషార్ దేశ్‌పాండేలు ఆసీస్ ఓపెనర్లు సామ్ కాన్‌స్టాస్ (20), క్యాంప్‌బెల్ కెల్లవే (0)లను పెవిలియన్‌కు పంపారు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో నాథన్ మెక్‌స్వీనీ (23), పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (0) ఉన్నారు. ఈ మ్యాచ్‌లో భారత్ గెలవాలంటే మిగతా 8 వికెట్లు పడగొట్టాల్సి ఉంది. భారత బౌలర్ల జోరు చూస్తుంటే ఆసీస్‌ను ఆలౌట్ చేయడం పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. అంతకుముందు భారత్-ఎ తమ రెండో ఇన్నింగ్స్‌లో 199 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ సాయి సుదర్శన్ 39 పరుగులతో రాణించగా.. వన్‌డౌన్ బ్యాటర్, కెప్టెన్ దేవదత్ పడిక్కల్ అర్ధ శతకంతో (88 బంతుల్లో 59) రాణించాడు. అయితే తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం లభించడంతో పడిక్కల్ సేన ప్రత్యర్థి ముందు అద్భుతమైన లక్ష్యాన్ని ఉంచగలిగింది.





## అతడు నాకు సొంతమైనా
# క్రష్ తగ్గట్లేదు : రష్మిక

విజయ్ దేవరకొండ, రష్మిక వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన తరువాత తొలిసారి జంటగా నటిస్తున్న చిత్రం 'రణబాలి'. సింగనమల బొబ్బిలి రణబాలిగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తుండగా, ఆయన భార్యగా జయమ్మ పాత్రలో రష్మిక కనిపించనున్నారు. ఈ సినిమాలోని ఇప్పటికే విడుదల చేసిన 'ఏందయ్యా సామీ..' పాటకు మంచి స్పందన వస్తోంది. అందులో విజయ్, రష్మికల మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. తాజాగా ఆ పాట క్లిప్‌ను రష్మిక ఇన్‌స్టాలో పంచుకుంటూ, విజయ్‌పై తన ప్రేమను వ్యక్తం చేయడం విశేషం. "అతడు పూర్తిగా నాకే సొంతమయ్యాడు. కానీ తనపై క్రష్ ఏమాత్రం తగ్గడం లేదు. ఇదేం విచిత్రమో" అని రష్మిక పోస్ట్ చేయగా, విజయ్ దీనికి తనదైన శైలిలో రిప్లై ఇచ్చారు. "నేను ఎంతో అదృష్టవంతుడిని. జయమ్మను మిస్ అవుతాను కానీ, నువ్వు జీవితాంతం నా దగ్గరే ఉంటావు" అని విజయ్ స్పందించారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం చూసి నెటిజన్లు ముచ్చటపడుతున్నారు. ఇదిలా ఉండగా, రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తున్న 'రణబాలి' దసరా కానుకగా అక్టోబరు 16న విడుదల కానుంది.

# థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమైన మమిత బైజు సినిమా



విష్ణు విశాల్, మమితా బైజు జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఇరందు వానం'. రామ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌పై గత కొద్ది రోజులుగా ఎన్నో ఊహాగాణాలు వినిపించగా.. తాజాగా అఫీషియల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు ఇరందు వానం అక్టోబర్ 23న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు తెలుపుతూ.. 'కేవలం వారి ప్రేమ, విధి మాత్రమే వారిని ఒకటి చేస్తాయి' అనే ఇంట్రెస్టింగ్ క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ అప్డేట్ పోస్టర్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నది. 'ముండాసుప్టి', 'రాక్షసన్' లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాల తర్వాత విష్ణు విశాల్, దర్శకుడు రామ్ కుమార్ కాంబినేషన్‌లో వస్తోన్న మూడవ చిత్రం కావడంతో.. 'ఇరందు వానం'పై కోలీవుడ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అంతే కాకుండా.. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ కూడా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. ఇక రిలీజ్ డేట్ ప్రకటించడంతో త్వరలో ప్రమోషన్స్‌లో భాగంగా మరిన్ని అప్డేట్స్ పంచుకోనున్నారు మేకర్స్.

# రక్తపాతంతో హడలెత్తించే జడల్

**ది ప్యారడైజ్ రివ్యూ**

రెండు వేల కిలోమీటర్లు నడిచొచ్చి ప్యారడైజ్ దగ్గర స్థిరపడిన ఏడు వేల మందితో కూడిన ఓ జాతి పేరే సవారీలు. దేశం కోసం పోరాడిన కుటుంబాలు అందులో ఉన్నప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం ఎవ్వరికీ గుర్తింపు ఉండదు. తరాలుగా ఆ గుర్తింపు కోసమే పోరాటాలు జరుగుతుంటాయి. ఏడు వేల మంది కాస్త ఐదు వేల మందికి తగ్గిపోతారు తప్ప గుర్తింపు మాత్రం దక్కదు. శిఖంజా మాలిక్ (మోహన్‌బాబు) కుటుంబం తరాలుగా సవారీలను చిన్నచూపు చూస్తూ అణగదొక్కుతూ ఉంటుంది. ఎదురు తిరిగిన వాళ్లని చంపేస్తుంది. మాలిక్ కుటుంబానికి భయపడి సవారీలకు సాయం చేయడానికి ఎవ్వరూ ముందుకు రారు. వైద్యం, విద్య, ఉపాధి... ఇలా అన్నింటికీ దూరమవుతారు. గత్యంతరం లేక దొంగతనాలు, సారా తయారీతో బతుకుని కొనసాగిస్తుంటారు. మాలిక్ చిత్రహింసల మధ్యే ఇద్దరు కవలలకు జన్మనిచ్చిన సమ్మక్క (సోనాలి కులకర్ణి) తన కొడుకు జడల్ (నాని) సవారీలకు నాయకుడై గుర్తింపుని సాధిస్తాడని ఆశపడుతుంది. కానీ, తల్లి అంటే ఏమాత్రం ఇష్టం లేని జడల్.. సవారీలకు నాయకుడు అయ్యాడా?తన జాతికి గుర్తింపు తీసుకొచ్చాడా?అసలు అతనికి జడల్ అనే పేరు ఎందుకొచ్చింది?చిన్న వయసులోనే జైలుకు ఎందుకు వెళ్లాడు?తిరిగొచ్చాక ఏం చేశాడు?జడల్‌కు మనసిచ్చిన సుబ్బు (కయాదు లోహార్) ఎవరు?తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.



### ఎలా ఉందంటే..

'ఈ జీవితమంతా పోరాటానిది, వచ్చే జన్మ మనది' అంటూ తమ జాతి గుర్తింపుకోసమే బతుకుల్ని పణంగా పెట్టిన తల్లీ కొడుకుల కథ ఇది. (ఛీఖఅబ్రూఖతీఘుఒఅంవ హ్శీతీఎ ాఖఅవ) కథ, కథనాల్ని పక్కనపెట్టి థియేట్రికల్ అనుభూతిని పంచే అంశాలకు పెద్దపీట వేస్తూ మలిచిన సినిమా ఇది. దృశ్యం, సంగీతం పరంగా తిరుగులేని ప్రభావం చూపిస్తుంది. సవారీల అట్టడుగు జీవితాలకు అద్దం పడుతూ, ప్యారడైజ్ ప్రపంచంలో లీనం చేస్తుంది. ప్రతీ ఫ్రేమ్ ఓ పెయింటింగ్‌లా తెరపై కనిపిస్తుంటుంది. అందుకు దీటుగా అనిరుధ్ పాటలు, నేపథ్య సంగీతం ఉంటాయి. మరోవైపు ఇన్నాళ్లూ నేచురల్ స్టార్‌గా కనిపించి అలరించిన నాని... ఇందులో 'షేర్ నాని'గా విజృంభణ చేస్తాడు.. జడలు మెలిపెట్టి వీరోచిత విన్యాసాలు చేస్తాడు.. గన్స్ పేలుస్తాడు.. పదునెక్కిన కత్తులతో రక్తం ఏరులై పారిస్తాడు.. అడుగడుగునా తలలు గాల్లో ఎగిరి పడుతుంటాయి. మొండేలు అడ్డంగా తెగిపడుతుంటాయి. హై మూమెంట్స్‌తో కూడిన ఈ హంగామా థియేటర్లలో ఈలలు వేయించొచ్చేమో కానీ, కొత్తదనం లేని కథ, ఆసక్తిని రేకెత్తించని కథనాలు మాత్రం నిరాశ పరుస్తాయి. తల్లీకొడుకుల కథ, గుర్తింపు కోసం ఓ సమాజం చేసే పోరాటంలాంటి అంశాలు... పలు సినిమాల మిశ్రమంలా అనిపిస్తుంది. మనసుల్ని కలవర పెట్టేలా హింస, రక్తపాతం కూడిన సన్నివేశాలు అధికం. సవారీల నేపథ్యాన్ని పరిచయం చేసే సన్నివేశాలతో సినిమా ఆసక్తికరంగానే మొదలవుతుంది. తొలి ఫ్రేమ్ నుంచే కథలోకి తీసుకెళుతుంది. జైల్ ఫైట్‌లోనే... హీరో చిన్ననాటి నేపథ్యాన్ని చూపిస్తూ సాగే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. జడలు, పచ్చబొట్టు వెనక కథని వివరించే సన్నివేశాలు ప్రథమార్ధానికి ప్రధాన ఆకర్షణ. అయితే తొలి అరగంట తర్వాత సినిమా క్రమంగా గాడి తప్పుతుంది. కథానాయకుడు జైలు నుంచి బయట వచ్చిన తర్వాత తెరపై కనిపించే సన్నివేశాలు.. హీరో హీరోయిన్ మధ్య ప్రేమకథ పెద్దగా ప్రభావం చూపించవు. విరామానికి ముందు వచ్చే సన్నివేశాలతో సినిమా మళ్లీ గాడిన పడుతుంది. తల్లీకొడుకులతో ముడిపడిన ఆ సన్నివేశాలు ద్వితీయార్ధంపై ఆసక్తిని రేకెత్తిస్తాయి. జడల్ కోరుకున్నట్టుగా శిఖంజా మాలిక్ (ఎశీష్ట్రుఅ ఘుఎబ జ్ఞుఖతీఘుఒఅంవ శ్రీశీఎ) బయటకు వస్తుండడంతో తదుపరి ఇద్దరి మధ్య ఏం జరుగుతుందా? అనే కుతూహలం పెరుగుతుంది. కానీ, ఆ అంచనాలకు తగ్గట్టుగా మాత్రం సినిమా సాగదు. ఒకే పార్శ్వంతో కూడిన కథ కావడం, కొత్తగా చెప్పడానికి అవకాశం లేకపోవడం ద్వితీయార్ధాన్ని పోరాట సన్నివేశాలతో నింపేసినట్టుగా అనిపిస్తుంది. భారతీయుడులో కమల్‌హాసన్‌ని గుర్తు చేస్తూ మోహన్‌బాబు చేసే విన్యాసాలు ఏమాత్రం అతకలేదు. ఎమ్మెల్యే శంకర్ (ప్రియదర్శి) అంటూ కేసీఆర్‌ను పోలిన పాత్ర రాకతో మళ్లీ తెరపై సందడి మొదలవుతుంది. పతాక సన్నివేశాలు.. ముఖ్యమంత్రి వచ్చే సన్నివేశాలూ ఆకట్టుకుంటాయి. కథకు రియల్ టైమ్ అంశాలతో ముడిపెడుతూ తీర్చిదిద్దిన ఆ సన్నివేశాలే సినిమాకి ప్రధాన ఆకర్షణ. కేసీఆర్ ప్రసంగాల్ని పోలిన సంభాషణలు, ఆయన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ఫస్టాఫ్‌లో మోహన్‌బాబు పాత్రని పరిచయం చేసిన తీరు ఎంతో బాగుంది. చివరివరకూ అదే టెంపోను కొనసాగించి ఉంటే ఇంకాస్త బాగుండేది. దృశ్యపరంగా ప్రతీ ఫ్రేమ్ ఆకట్టుకునేలా ఉన్నా, ప్యారడైజ్ సెటప్ చాలా చోట్ల కృత్రిమంగా అనిపిస్తుంటుంది. భావోద్వేగాలు కూడా పెద్దగా పండలేదు. ప్యారడైజ్ అనగానే మనందరికీ బిరియానీనే గుర్తొస్తుంది. సినిమాలోనూ బిరియానీ నేపథ్యంలో చాలా సన్నివేశాలే ఉన్నాయి. కాకపోతే ఇక్కడ ఆ వంటకం అంత బాగా కుదరలేదంతే.

# ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో ఊరట



ఐబొమ్మ వెబ్‌సైట్ ద్వారా సినిమాలను పైరసీ చేస్తున్న వ్యవహారంలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రవిని పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. ఆ సమయంలో ఆయన ఆర్థిక లావాదేవీల మూలాలపై దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైమ్ పోలీసులు.. పైరసీ ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం ఆయా బ్యాంకు ఖాతాల్లో జమ అయి ఉండొచ్చన్న అనుమానంతో రవికి చెందిన అన్ని బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేయించారు. అయితే.. తన బ్యాంకు ఖాతాలు స్తంభించిపోవడంతో తన కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని పేర్కొంటూ రవి నాంపల్లి న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఖాతాలు ఫ్రీజ్ కావడంతో తన కుటుంబ పోషణకు, రోజువారీ కనీస అవసరాలకు కూడా డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దయచేసి బ్యాంకు ఖాతాలపై ఉన్న ఫ్రీజ్‌ను ఎత్తివేయాలని ఆయన తరపు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకు కనీసం బ్యాంకు ఖాతాలను వాడుకునేందుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు.పిటిషనర్ వాదనలను, కుటుంబ వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న నాంపల్లి కోర్టు.. రవి అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించింది. దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ, కుటుంబ పోషణ కోసం తన బ్యాంకు ఖాతాలను వినియోగించుకునేలా ఆయనకు స్వేచ్ఛను కల్పించింది. రవి బ్యాంకు ఖాతాలపై విధించిన ఫ్రీజ్‌ను తక్షణమే ఎత్తివేయాలని సంబంధిత పోలీసు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది.



# ప్యారడైజ్‌లో కేసీఆర్‌గా ఆకట్టుకుంటోన్న ప్రియదర్శి

నాని కథానాయకుడిగా నటించిన 'ది ప్యారడైజ్' నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చి యాక్షన్ ప్రియులను మెప్పిస్తోంది. ఈ సినిమాలో టాలీవుడ్ హీరో ప్రియదర్శి పాత్ర ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఎమ్మెల్యే శంకర్ పాత్రలో ఆయన కేసీఆర్‌ను పోలిన పాత్రతో ఆకట్టుకుంటున్నారు. కేసీఆర్ ప్రసంగాలను పోలిన సంభాషణలు, ఆయన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా హావభావాలతో ప్రియదర్శి ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలను అభిమానులు షేర్ చేస్తున్నారు. తెలంగాణ యాసలో ఇరగదీశారని కామెంట్స్ చేస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' ప్రీ బుకింగ్స్‌లోనే టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. రిలీజ్ అనంతరం హవా కొనసాగుతోంది. ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్‌లలో ఇప్పటి వరకూ 15 లక్షల టికెట్స్ సేల్ అయ్యాయి. ఇది నాని కెరీర్‌లో రికార్డు స్థాయి అని అభిమానులు ఖుష్ అవుతున్నారు. మరోవైపు అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా ఈ మూవీ రూ.60కోట్లు (గ్రాస్)వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com